క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పెసరవాయి అంగన్‌వాడీలో చిన్నారుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ జబీన్

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వైద్యాధికారిణి డాక్టర్ మొల్లా జబీన్ తనిఖీ చేశారు. శనివారం పెసరవాయి సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కన్సెప్ట్ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రోగాలతో బాధపడే వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే ఆహారాన్ని రుచి చూసి పలు సూచనలు చేశారు. ఆహారంలో నాణ్యతలోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. గర్భిణి, పిల్లల బరువులను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు



మహిళల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని దొడ్డిపాడు, వామసముద్రం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు భూహక్కు పత్రాలు



ఉల్చాలలో భూముల రీ సర్వే చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): మండలంలో భూముల రీ సర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తామని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ రీ సర్వే చురుగ్గా సాగుతోందన్నారు. రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. శనివారానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 72444.59 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. సర్వేలో పీఎల్ఆర్ డీటీ శారద, వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పాణ్యంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి విజయశేఖర్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ఉర్దూ స్కూలులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని నోడల్ అధికారి విజయశేఖర్, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, భద్రత, ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే ఎంపీటీసీలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు గుర్తింపు కార్డులు అందజేసినట్లు చెప్పారు. మండలంలో 1074 మంది పట్టభద్రులు,74 మంది టీచర్లు ఉన్నట్లు తెలిపారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి



భూరికార్డులను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

పాణ్యం: కందికాయపల్లి గ్రామంలో గ్రీన్ కో సంస్థకు ఇచ్చిన భూముల సర్వేను త్వరగా పూర్తి చేయాలని నంద్యాల జాయింట్ కలెక్టర్ నిశాంతి సూచించారు. శనివారం గ్రామంలో సోలార్ పరిశ్రమకు కేటాయించిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2,850 ఎకరాలకు సంబంధించిన సర్వే, మ్యాపింగ్ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న భూమి సర్వే చేసి త్వరగా రికార్డులు పంపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, మండల సర్వేయర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జాతరకు రారండోయ్

- నేటి నుంచి గోరంట్ల శ్రీలక్ష్మీమాధవుడి బ్రహ్మోత్సవాలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన దేవదాయశాఖ అధికారులు

కోడుమూరు రూరల్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆలయాల్లో ఒకటి గోరంట్ల శ్రీలక్ష్మీమాధవస్వామి. కొలిచేవారికి కొంగుబంగారంగా విరసిల్లుతున్న ఈ స్వామికి ఎంతో చరిత్ర ఉంది. చోళుల కాలం నాటి ప్రాశస్త్యాన్ని సంతరించుకున్న గోరంట్ల మాధవాలయానికి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. చోళ (క్రీ.శ 1105), యాదవ (క్రీ.శ 1210), అరవీటి (క్రీ.శ 1628) రాజుల శిలా శాసనాలు ఇక్కడ లభించాయి. శిలా శాసనాలపై 1937–38 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వం సర్వే జరిపించి స్వామికి సంబంధించిన తామ్ర శాసనాలు మద్రాసుకు చేర్చినట్లు రికార్డుల్లో ఉంది. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో స్వామికి సంబంధించిన మాధవ శతకం, మాధవాష్టకం తాటాకు గ్రంథాల్లో లభిస్తాయి. కాగా పూర్వకాలంలో గోరువంక మహాముని ఈ పరిసర ప్రాంతంలో నివసించారని, అందుకే గోరువంక మహాముని పేరు మీదుగా గోరంట్ల అనే పేరు వచ్చిందని చెబుతారు. మూడు దశాబ్దాల క్రితం దేవదాయ శాఖ వారు ఈ ఆలయాన్ని స్వాధీన పరచుకున్నారు. స్వామి ఆలయానికి 704.54ఎకరాల భూమి కూడా ఉంది.

నేటి నుంచి స్వామి బ్రహ్మోత్సవాలు

గోరంట్ల శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 5వ తేదీ ఆదివారం అంకురార్పణ, రక్షాబంధనము, 6న ధ్వజారోహణం రాత్రి బేరిపూజ సింహోత్సవం, 7న శేషోత్సవం, 8న హనుమంతోత్సవం, 9వ తేదీ రాత్రి శ్రీవారి కల్యాణోత్సవం, గరుడోత్సవం, 10న గజతోత్సవం, 11న శిభికోత్సవం, 12న పల్లకీసేవ, 13న రథారోహణం, 14న శ్రీవారి రథోత్సవం, 15న పార్వేట, 16న హంసవాహనం, వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, రాత్రికి కంకణ విసర్జన కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో దేవదాయ శాఖాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



ఎత్తైన శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయ గోపురం

శ్రీవారి కల్యాణం ప్రత్యేకత

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడోత్సవం రోజు నిర్వహించే శ్రీవారి కల్యాణాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఏటా స్వామి అమ్మవార్ల కల్యాణ సమయంలో నిరుపేద జంటలు ఇక్కడ వివాహాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

ఆలయ భూములపై విచారణ చేపట్టాలి

ఓర్వకల్లు: మండలంలోని గుట్టపాడు గ్రామంలో ఆక్రమణకు గురైన ఆలయ భూములపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గుట్టపాడు గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పూర్వీకులు కట్టించిన సత్రంలో పార్టీ కార్యాలయం పెడుతున్నట్లు టీడీపీ వారు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. సామాజిక సేవా దృక్పథంతో గ్రామంలో నిరుద్యోగ యువత కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సత్రాన్ని మరమ్మతు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ స్థానిక నాయకుడు మాదిరిగా తాము దుర్మార్గపు పనులు చేయడం లేదన్నారు. ఆలయ భూములను ఆక్రమించుకుని చరిత్ర ఆయనదన్నారు. 147 సర్వే నెంబర్‌లో 5.34 ఎకరాలు, 172 సర్వే నెంబర్‌లో 9.08 ఎకరాల చొప్పున మొత్తం 14.42 ఎకరాలను సదరు టీడీపీ నాయకుడి అతనిపేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడన్నారు. అంతేకాకుండా 274 సర్వే నెంబర్‌లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని బినామీ పేర్లతో స్వాధీనం చేసుకున్నాడన్నారు. ఇలా అన్యాక్రాంతమైన ఆలయ భూములపై రెవెన్యూ అధికారులు, దేవదాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి సదరు భూములను స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి, అక్బర్‌అలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీకాంతారెడ్డి

పల్లెలను పరిశుభ్రంగా ఉంచండి

గడివేముల: పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డి కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి రోజు పారిశుద్ధ్య పనులు పరిశీలించాలన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. నిత్యం గ్రీన్‌అంబాసిడర్లు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. అలాగే వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గడివేముల గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- ఉల్లంఘిస్తే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు

కర్నూలు: మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వొద్దని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.నాగభూషణం అన్నారు. దీనిని ఉల్లంఘిస్తే ఆ వాహనాల యజమానులు, తల్లిదండ్రులు, సంరక్షకులపై కేసులు నమోదు చేస్తామని, కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్‌విహార్ సెంటర్‌లో మోటర్ వాహనాలపై త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 29 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.44,515 జరిమానా విధించారు. అనంతరం వారిని కొత్తపేట వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి అవగాహనా లోపంతో వారు చేసే రోడ్డు ప్రమాదాలకు బాధ్యులు కావద్దని తల్లిదండ్రులకు హెచ్చరించారు. మైనర్లు, లైసెన్స్‌లు లేనివారికి వాహనాలు ఇచ్చే యజమానులు, తల్లిదండ్రులు, గార్డియన్లపై ఐపీసీ 304 సెక్షన్ కింద పదేళ్లు, 308 సెక్షన్ కింద ఏడేళ్ల శిక్ష విధించే అవకాశముంటుందన్నారు. భవిష్యత్తులో మైనర్లకు వాహనాలు అప్పగించమని, ట్రాఫిక్ నిబంధనలు ఇకపై ఉల్లంఘించమని వారి చేత డీఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు.

ఏకాగ్రతతో కష్టపడితే విజయం వరిస్తుంది

కర్నూలు: పోలీసు శాఖలో ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సాధన చేసే అభ్యర్థులు ఏకాగ్రతతో కష్టపడితే విజయం వరిస్తుందని కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ అన్నారు. నగరంలోని మేడం విజయ్ గ్రాండ్ హోటల్‌లో శనివారం ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల అభ్యర్థులకు కర్నూలు ప్రగతి సమితి అధ్యక్షులు ఎం.శ్రీహర్ష ఆధ్వర్యంలో టీషర్టుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలనేవారు నిరంతరంగా మంచి ఆలోచనతో సంతోషంగా ఉంటూ చదువుతున్న అంశాన్ని క్షుణ్ణంగా ఏకాగ్రతతో చదివితే ఉద్యోగ పరీక్షల్లో తప్పక విజయం సాధిస్తారన్నారు.



ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న కర్నూలు డీఎస్పీ కె.వి.మహేష్

అనంతరం ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు డీఎస్పీ చేతుల మీదుగా టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేపీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

8న కాల్వలో పొట్టేళ్ల పోటీలు

ఓర్వకల్లు: కాల్వ గ్రామంలో ఈ నెల 8 వ తేదీన పొట్టేళ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని హజరత్ సయ్యద్ సుల్తాన్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించే పోటీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచే పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల పొట్టేళ్ల యజమానులు రూ.200 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కాలం చెల్లిన మందులు విక్రయించొద్దు



మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల డీలర్లు కాలం చెల్లిన వాటిని రైతులకు విక్రయించరాదని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు మందులను పరిశీలించారు. రైతులకు విక్రయించే ఎరువులు,మందులు, విత్తనాలకు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అనుమతులు ఉండాలన్నారు. రైతులు కొనే ప్రతి వస్తువుకు రసీదు ఇవ్వాలని, రేట్ల పట్టికను దుకాణాల ముందు తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. అధిక రేట్లకు విక్రయించినా, అనుమతి లేని మందులను కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని ఏఓ హెచ్చరించారు.

డైరీ ఆవిష్కరణ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని పాణ్యం సర్కిల్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీని సీఐ వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, గడివేముల ఎస్‌ఐ వెంకటపుబ్బయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండే జర్నలిస్టుల సేవలు మరువలేనివన్నారు. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని వారు క్షణాల్లో అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

9న బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో ఈ నెల 9వ తేదీన రాష్ట్ర స్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని సయ్యద్ సుల్తాన్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసును పురస్కరించుకుని గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో విజేత ఎడ్ల యజమానులకు వరుసగా, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన పేర్కొన్నారు. పెంచికలపాడులో శనివారం తాగునీటి పథకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం కావడంతో బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోయి గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా గ్రామీణ ప్రాంతాల్లో పాడైపోయిన చేతిపంపులు, పైపులైన్లను మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసులకు శనివారం 1,210 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

పశువులకు టీకాలు వేయించుకోవాలి

సి.బెళగల్: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ వ్యాధి సోకకుండా ముందుగానే పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. దీనిపై ఆయన శనివారం సి. బెళగల్ గ్రామ సచివాలయం – 2లో గ్రామ సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన గ్రామ వలంటీర్లకు, రైతులకు అవగాహన కల్పించారు. జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గాలికుంటు టీకాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. గత రెండు రోజులుగా మండలంలో 624 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ తెలిపారు.

బస్సును ఢీకొన్న కారు



జాతీయ రహదారిపై నిలిచిన ఆర్టీసీ బస్సు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని విజయా నికేతన్ పాఠశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై నంద్యాల నుంచి కర్నూల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొంది. ఎదురుగా లారీ ఉండటంతో బస్సు డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న కారు బస్సును ఢీకొంది. అయితే, ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు. కాగా జరిగిన ఘటనపై రెండు వాహనాల డ్రైవర్ల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. హైవే పెట్రోల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురికి సర్దిచెప్పి పంపించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

పాణ్యం: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, నంద్యాల జిల్లా ఆ పార్టీ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. శనివారం నెరవాడ వద్దనున్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ నేడు రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. ఈ ప్రగతికి సీఎం వైఎస్ జగన్ ముందు చూపే కారణమన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్య సమస్యలకు పరిష్కారం చూపి వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేశారని వివరించారు. ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శాంతిరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా, ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి

పార్టీ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సుధాకర్
- సి. బెళగల్ మండలంలో సుడిగాలి పర్యటన

సి.బెళగల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులను గెలిపించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం వరకు బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, సి.బెళగల్, కంబదహాల్, చింతమానుపల్లె, సంగాల, గుండ్రేవుల తదితర గ్రామాల్లో సచివాలయాలు, స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పథకాలు, అభివృద్ధిని చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి ఆయనకు అండగా నిలవాలని కోరారు. అంతకు ముందు ఆయన గొల్లలదొడ్డి గ్రామానికి జేసీఎస్ సీబీ తులసిరెడ్డి, మండల నాయకులతో కలిసి స్కూటీపై వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సి.బెళగల్ సచివాలయంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నాయకులు

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

గూడూరు: ఈ నెల 13 న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని శనివారం ఆ పార్టీ నాయకులు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు ఓటర్లను కలుసుకుని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కోడుమూరు రూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని గోరంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో జగనన్న కాలనీలను హౌసింగ్ డీఈఈ వాసుదేవరావుతో కలిసి సందర్శించారు. అలాగే గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం కింద ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అలాగే గృహ నిర్మాణానికి సాయం కూడా అందజేస్తుందన్నారు. లబ్ధిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు మాట్లాడుతూ ఉగాదిలోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను శనివారం హౌసింగ్ ఏఈ జమ్మన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని జగనన్న కాలనీలో 80కి పైగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. తరచూ లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పిస్తుండటంతో పనులు వేగవంతమయ్యాయన్నారు. ఇప్పటికే 15 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా, మిగతావి టాప్ లెవెల్, లింటల్ లెవెల్, బేస్‌మెంట్ దశలకు చేరాయన్నారు.



గోరంట్లలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, హౌసింగ్ డీఈఈ

ఉద్యాన పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందని ఆ శాఖ నంద్యాల జిల్లా అధికారి నాగరాజు అన్నారు. శనివారం ఆయన ఉద్యాన శాఖ పంట ఉత్పత్తుల దిగుబడి సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులను చైతన్యవంతులుగా చేసి ఉద్యాన పంటల సాగులో ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. డ్రిప్ ఏర్పాటుకు రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఈ ఏడాది పండ్ల తోటల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతర స్థానికంగా సాగు చేసిన నేరెడు, చింత, మామిడి, అరటి తోటలను పరిశీలించారు. మామిడి పూత, పిందె దశలో ఉన్నందున రైతులు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి దివ్య, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భూపనపాడులో ఉద్యాన పంటల ఉత్పత్తి సెంటర్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ నాగరాజు

బాలింతలకు ఇంటి వద్దే ఆరోగ్య సేవలు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రామగిడ్డయ్య

కర్నూలు (న్యూటౌన్): బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారికి ఇంటి వద్దే ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య వైద్యులను ఆదేశించారు. శనివారం కర్నూలు మండలం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వైద్యులు, సిబ్బంది హెల్త్ క్యాంప్‌లు నిర్వహించి రోగులకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. గర్భిణులకు, అధిక రక్తపోటు, మధుమేహం గల వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

సి.బెళగల్/కల్లూరు: మండల రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ మల్లేష్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో సుస్థిర వ్యవసాయంలో భాగంగా 20 ఏళ్ల క్రితం ఏర్పాటైన తుంగభద్ర సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం వార్షికోత్సవం జరిగింది. సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఓ హాజరై రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించడంపై అవగాహన కల్పించారు. పంటల సాగులో సేంద్రియ ఎరువులు వినియోగంతో ఆహార పదార్థాలు కలుషితం కావని చెప్పారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, సోమశేఖమ్మ, వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం అధికారి రమణ, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు, రైతులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య అన్నారు. శనివారం ఏ.గోకులపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయడంపై పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ కంటే ముందు 30 రకాల నవధాన్య విత్తనాలను ఎకరానికి 13 కేజీల చొప్పున వేయాలన్నారు. ఈ విత్తనాల్లో పచ్చిరొట్ట, పప్పు ధాన్యం, ఆకుకూరల, కాయగూర, సుగంధ ద్రవ్యాల విత్తనాలు ఉండాలన్నారు. గ్రామానికి చెందిన చిన్న స్వాములు, మహాదేవమ్మ అనే రైతులకు పీఎండీఎస్ నవధాన్యాల కిట్లను అందజేశారు. ఈ తరహా వ్యవసాయం వల్ల పర్యావరణానికి ఎటువంటి నష్టం జరగదన్నారు. అలాగే నేల సారవంతమై మంచి దిగుబడిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం